స్కెచ్

# ఉజ్వల భవిష్యత్తు!

"భరణి"

రకరకాల మొక్కలు. అడ్డదిడ్డంగా కత్తిరించిన మొక్కల వరుసలు. ఒకచోట గుబురుగా అందమైన పూలమొక్కలు దాని పక్కన విశాలమైన ఖాళీ. (ఎడారి అనవచ్చు.) ఇంకోచోట బట్టతలమీది వెంట్రుకల్లా నిలబడ్డ మొక్కలు. పార్కు యెలా వుంటేనేం కూర్చోడానికి హాయిగానే వుంది. నేలమీది గడ్డి పక్షపాతం లేకుండా, ఒకదాని మీదొకటి అసూయ పడకుండా అన్నీ సమానంగానే పెరిగాయి. అదొకటి హాయిగా వుంది. కన్నులు చూస్తున్న శూన్యాన్ని దాటి యెక్కడికో పోయి, యేమిటో అన్వేషిస్తున్న మనసు గంభీర కంఠం వినబడి తిరిగిచూసింది. పార్కు రేడియో లౌడ్‌స్పీకర్ "మనం వుజ్వలమైన భవిష్యత్తు నిర్మించుకోవాలి. మన ప్రజల కండలో బలం — బుర్రలో మెదడు-అన్నీ వున్నయ్. మనకు లేని దొక్కటే—అదే ధనం. దానికి ప్రజల సహకారం కావాలి"...మనకు లేని దొక్కటే: అదే ధనం, అంతేనా? ఇంకా ఆ గంభీరకంఠం తరుముతూనే వుంది. "నేడు సంస్కరింప బడాలి. రేపు మహోజ్వలంగా వుండాలి. యువతీ యువకులు సహకరించాలి...విద్యార్థులు తోడ్పడాలి. మనకు వుజ్వలమైన భవిష్యత్తు కావాలి." ఉజ్వలమైన భవిష్యత్తు అంటే యేమిటి? యెలా వుంటుంది?

మనసు ఆలోచిస్తోంది. కాళ్ళు పార్కు ఆవరణ దాటి వచ్చేస్తున్నాయి. బుర్ర అంతుపట్టని అర్థం కాని ఆలోచనలు చేస్తోంది. ఇంతలో యేదో హడావుడి, గోల. నడిరోడ్డుమీద గుంపుగా చుట్టుకుని మనుష్యులు. దూరంగా అలానే నుంచుని చూస్తున్నాను. ఒక్క అయిదు నిమిషాల్లో అంతా సర్దుకుంది. అందరూ విడిపోయి వచ్చేస్తున్నారు. అక్కడేం జరిగింది? ఒకవ్యక్తి నిలువునా పడిపోయి వున్నాడు. ఇంకా లేవలేదు. చుట్టూ వెళ్ళిపోతున్నవాళ్ళ వ్యాఖ్యానాలు.

"అరే ఆదంతా నటనరా తిండిలేక పడటం కాదు. అంతా వేషం. పట్టి మోసం." అంది ఓ పెద్దకంఠం.

"ఆకలికాదు యేమీ కాదండి, యెవడో చదువుకోనేవాడిలా వున్నాడు. చెడు తిరుగుళ్ళు తిరిగి సినిమాలకుపోయి నడిరోడ్డుమీద పడ్డాడు. వెధవని పక్కకు లాగెయ్యండి" అంది మరో లావు కంఠం.

"ఇది చూసారా! అబ్బా! ,ఆకలి! అని అఱచి పడిపోయాడట. వేషం కాకపోతే స్టేజిమీది నటుడిలా 'అబ్బా! ఆకలి' అని షోకుగా అరచి, ముందే నాశ్చింగిచ్చి మరీ పడిపోయే దెవరండీ! వెధవ బుద్ధులు! వెధవ వేషాలు!" అంది మరో పొట్టి కంఠం.

"వాడు మావాడేనండీ రాత్రేగా నేను వాడికి ఆకలని యేడుస్తుంటే అన్నం పెట్టింది. నాటకాల్లో మావాడు బాగా వేస్తాడులెండి" అంది ఓ అసూయ విద్యార్థి కంఠం.

మొత్తానికి అందరూ సర్దుకున్నారు. మిగిలింది నేలను కఱచుకున్న ఆవ్యక్తే.

నాకాశ్చర్యం వేసింది. ఎవ్వరూ నీళ్ళయినా జల్లలేదు. లేపలేదు. విచిత్రం! అతని వైపుకు నాలుగు అడుగులు పడ్డయ్. ఇంతలో టక్కున ఆగిపోయాను. ఇంతమంది యేమీ చేయకుండా విడిచేసిన ఆవ్యక్తి! ఇందరి మధ్యలో యిప్పుడు నేను! హృదయం వణికింది. చరచరా నడిచి వెళ్ళిపోయాను. మెదడు, మనసు మాట్లాడుకుంటు న్నాయ్. 'ఛీ నీకన్నీ పాడు ఆలోచనలే. అతిగా ఆలోచిస్తావ్. బుద్ధిలేదు.' అంది మనసు. "నువ్వు వట్టి పిఱికిదానివి, నీదే అంతా తప్పు నీకూ వాళ్ళకి క్రియలో యేమిటి భేదం? ఎంత పీక్కుంటేనేం. నువ్వుచేసిందేమిటి?" అని మెదడు. నిజమే యేమిటీ భేదం?

కాళ్లు టక్కున ఆగిపోయినయ్. మళ్ళీ యేదో గలాభా. పక్కనే వున్న కొట్లో రిబ్బన్లు చూస్తు న్నట్లుగా నుంచుని వింటున్నాను.

ఒక లావు మనిషి అరుస్తున్నాడు రిక్షావాడి మీద; 'అంతవాడికీ యింతవాడికీ ఒకటే ఆశ. యెవడిని చూచినా ఒకటే ఆశ. డబ్బు!-డబ్బు! మరీ మీరిపోతున్నారు. కష్టపడగూడదు. చెమట బట్టగూడదు. డబ్బులు రావాలి. ఎలా వస్తయ్? మధ్యలో నన్ను పడవెయ్యడమేగాదు. అంతదూరం తీసుకువెళ్ళనేలేదు. వెధవకి మూడణాలు కావాలి. ఎలావస్తయ్? బేడాయె యిస్తాను' ఒగురుస్తున్నాడు.

"బాబ్బాబు బీదోణ్ణి. రిక్షాకూడా యిరిగి పోనాది. యింతదూరం లాగానండి. మూడణా లిప్పించండి. బాబూ! కష్టమండి." జాలికంఠం.

"ఆ! ఆ! రిక్షానే నిరగ్గొట్టా నంటావురా!" వురిమాడు. బేడ వాడి ముఖాన్న వేసి స్థూల కాయాన్ని తోశాడు ముందుకు.

అసలు విషయం. మూడుమైళ్ళకు మూడణాలు రిక్షా మాట్లాడుకున్న మనిషి గమ్యస్థానం యింకా మూడడుగులుందనగా చక్రం విరిగి రిక్షావాడు సైడుకాలువలో సగం పడ్డాడు. బరువు మనిషి నెమ్మదిగా వరిగి నేలని ముద్దుపెట్టుకున్నాడు. నవ్వాలా ఏడ్వాలా!

కాళ్లు మళ్లా ముందుకు సాగాయి. కళ్ళు చుట్టూ పరిస్థితులను తిలకిస్తున్నయ్. పోలీసు యింకొంచెం దూరంలో వున్నాడు. ఇద్దరు గుండ్రటి స్త్రీలు. ఒక కంఠం.

"ఆ! ఆ! యెంతపొగరురా నీకు. యిద్దరిని యెక్కించుకోనంటావ్. నే నెవరినో తెలుసా? మా ఆయన యెవరో తెలుసా? చూడు మా ఆయనతోచెప్పి నీపనేం చేస్తానో" వురిమింది.

"అమ్మా! పోలీసుబాబులండీ."

అరుస్తూ రెండు కాయాలూ కూర్చున్నయ్. పోలీసు దగ్గరపడ్డాడు. రిక్షావాడని కేకెయ్యబో తున్నాడు. ఆఫీసరుగారిభార్యగారు అతిహుందాగా ఫోజుపెట్టి ముఖం ముందుకు చాచింది. పోలీసు చిరునవ్వు నవ్వుతున్నాడు. ఆఫీసరుగారి భార్య గారికి విజయం లభించింది. పోలీసు రిక్షావాడివైపు గుడ్లు పెద్దజేసి చూసాడు—వచ్చేటప్పుడు బేడ నాకు చెల్లించాలి సుమా! అన్నట్లు. రిక్షావాడు మరీ జరిగి నడిచాడు.

నా మనసు గట్టిగా నవ్వింది. ఉజ్వలమైన భవిష్యత్తు కావాలి మనకు. నేడు సంస్కరింప బడాలి. ప్రజలు సహకరించాలి. ఏమిటది! ఉజ్వల మైన భవిష్యత్తు అంటే యెలా వుంటుంది? ఎవరు సహకరించాలి? యెలా సహకరిస్తున్నారు? అన్నీ పిచ్చిప్రశ్నలే. ఇల్లు వచ్చేసింది.

* * *

కాలేజీకి కొత్తగా వెళ్ళడం. కొత్తస్థలం. ఎటుపోవాలో? లోపలికెళ్ళాను. అంతా మగ వాళ్లు. యెటుపోవాలి? సందేహం. బోలెడన్నికళ్లు చూస్తున్నయ్. రెండడుగులు ముందుకు వేసాను. ఒకరిలో "దయచేసి లేడీస్‌రూమ్ యెక్కడ...? ఇకిలించాయి గుర్రాలు! ఎలానో తిప్పలుపడి వెళ్ళి కూర్చున్నాను. ఆ అవర్ ఖాళీ అని తెలిసింది. అలానే కూర్చున్నాను. చుట్టూ చూస్తుంటే ఆశ్చ ర్యంగా వుంది. కాలేజీ తెరిచి వారంరోజు లయింది.

ఇది లేడీస్ రూమా! లేకపోతే పాతసామాన్ల గదా? ఏమో! నవనాగరిక యువతి ముఖంమీద అరంగుళం యెత్తున మెత్తిన పౌడరులా వుంది ఆ నేలమీది దుమ్ము. నేటి అబ్బాయిగారి తలమీది జుట్టులా వేలాడుతోంది పైనుంచి బూజు. విరిగి పోయిన కుర్చీలు బల్లలు రాజ్యం చేస్తున్నయ్. బూజుపట్టిన భావాలతో నిండిన బుర్రలా వుందా గది. అన్నీ నన్నుచూసి నవ్వుతున్నాయా? ఇంతలో కూర్చున్న కుర్చీ కిర్రుమంది. క్రిందనుంచి కుక్క ఒళ్ళు దులుపుకుంటూ పోతోంది. నవ్వాలా? ఏడ్వాలా? కాని అప్పట్లో ఏడుపును ఓడించి నవ్వు పకపకమంది. పక్కనుంచి మాటలువినబడ్తున్నయ్.

"చూడు సరూ! రాధకి మహా గొప్ప కాకపోతే తానొక్కర్తే వెళ్ళి డిబేట్‌లో మాట్లాడాలా? పార్లమెంటులో పాల్గొనాలని వుందా? మనకు మాత్రంలేదా ఆ మాత్రం తెలివి? సిగ్గులేదు!"

"ఏడ్చిందిలే. పోనీ విరగడై పోయింది గా. పక్కకు చూస్తూ అలా అలా నెమ్మదిగా నడవ లేకపోతే త్వరగా నడవగూడదూ అందే నన్ను." చెప్పుకుంటున్నయ్ చీరలు. ఆశ్చర్యం వేసింది ఆ తీరు చూస్తే.

ఆ గది చూపిస్తూ "యిదేమిటండీ" అని అడిగానో అమ్మాయిని. కళ్ళు గిర్రున తిప్పుతూ ఘనకార్యమన్నట్టు "యింకా నయం!"అంది. తలమీది వెంట్రుకలు గదిలో దుమ్ముకణాల్లా యెగిరినయ్

బుర్ర గిరగిరా తిరుగుతోంది. అంతా తమాషాగా వుంది. గంభీర కంఠం వినబడుతోంది. "నేడు సంస్కరింపబడాలి. రేపు మహోజ్వలంగావుండాలి. యువతీ యువకులు సహకరించాలి. విద్యార్థులు తోడ్పడాలి." ఇది మంచిపేరువున్న కాలేజీ. అంతా తెలిసినవాళ్ళే. అంతా నేటి యువతీయువకులు. రేపటి పౌరులు. ఉజ్వలమైన భవిష్యత్తు అంటే యెటువంటిది? సంస్కరింప బడవలసింది యేమిటి? యెలా? అన్నీ సమస్యలే.

మున్పైఫై రోజులు గిర్రున తిరిగేటప్పటికి ఆ అమ్మాయి పేరు (కొంతసేపు అమ్మాయి అంటేనే బావుంటుంది.) "లీడింగ్ లేడీ"! ఆ కాలేజీ పేరు పొందించే కావచ్చు. కాని అంతా యేదో యంత్రాల్లా, బాధ్యత తీర్చుకోడానికన్నట్లు వస్తూ పోతూ వుంటారు. ఒక్కరి ముఖాల్లోనూ వుత్సాహం వుండదు. కొన్ని వెకిలి యంత్రాలు మాత్రం రాజ్యంచేస్తుంటయ్. ఫీ పెడ్తూ వుంటయ్. వాటికి కాస్త నూనెపోసి చెవులు మెలిపెట్టి బాగు జేసేవాడుండడు. ఆ అమ్మాయి అవి బాగుపడాలంది, సహృదయత పెంపొందాలంది. డిబేట్‌లో పాల్గొంది. పార్లమెంటులో మాట్లాడింది. మేమూ నాటకాల్లో పాల్గొనవచ్చా? అంది. ఒక్కసారిగా 'లీడింగ్ లేడీ'అయిపోయింది. లీడింగ్ లేడీ కాదు. మన సుపుత్రుల సు(దుర్)బుద్ధులను పైకిరాకుండా బేడీలువేసే లేడీ!

* * *

మొదటిరోజులా అలానే పార్కులో కూర్చుని వున్నాను. ఆనాటి గంభీరకంఠం చెవుల్లో మోగుతోంది. మనుషులు యేదో వుత్సాహంగా వుల్లాసంగా తిరుగుతున్నారు. కళ్ళు పరిసరాలను పరిశీలిస్తున్నయ్. ఓపక్క ఫలితాన్ని పొందిన అపరచితుడి చేతుల్లోనుంచి అపరిచిత (ప్రస్తుతం పరిచిత) చేతుల్లోకి రూపాయిలు మారినయ్. ఓ కుంటివాడి చెయ్యి అపరిచితుడి ముందుకు జరిగింది. కళ్ళు రంగుమారి వెల్లకిలా తిరిగి వాడివైపు వురిమినయ్. నా మనసు కొట్టుకుంది. ఛీ, ఛీ, అంతా కల్మషం. ఆరోజు నడిరోడ్డుమీద పడిపోయిన వ్యక్తి కళ్ళల్లో మెదిలాడు. ఆ గంభీర కంఠం వినబడుతోంది. సంస్కారం... యువతీయువకులు... ఉజ్వల భవిష్యత్తు! అవును కావాలి. యేవో, యేవిధంగా? చుట్టూ చూసాను. పార్కు విశాలంగా వుంది. ఈ ప్రపంచం విశాలంగా వుంది. సముద్రం విశాలంగావుంది. అన్నీ చూడడానికి బాగానేవున్నయ్. కాని యేదో కుంచించుకుపోతోంది. అసలు యేదో విశాలంగా వుండాలి, లేదు. యేది? మన......? భావా......!

ఏదో పొగ ముఖంమీదికొచ్చింది. యెదురుగా కొంచెం దూరంలో నవనాగరిక యువకుడు—రేపటి పౌరుడు—భవిష్యత్తుకు పురుగు—ధూమపు మేఘాలను తీరిగ్గా మీధికి వదులుతున్నాడు. చుట్టూ చూసాను. అరే! చీకటి. అక్కడక్కడ యెవరో. చీకటిపడింది. చెయ్యి యెదురుగా మనిషి చెంపకి అతుక్కుంది. అడుగులు చరచరా ముందుకు పడ్డాయ్. గంభీర కంఠం గిరగిరా చుట్టూ వలయాలుగా తిరుగుతున్నది. సంస్కారం...సంస్కారం... యువతీయువకులు...ప్రజలు...విద్యార్థులు...రేపు మహోజ్వలంగా వుండాలి...భవిష్యత్తు...ఉజ్వల భవిష్యత్తు...యెప్పటికి?...యెప్పటికి?...! నేడులెన్నో నిన్నలౌతున్నయ్. రేపు మరునాడు నేడౌతుంది. కాని మార్పులేదు...మరి...యెప్పటికో!

---

ఇప్పుడు తేల్చుకోవలసిన ప్రశ్న యుగయుగాల మన జాతీయ సంస్కృతిని నేడు మనం రక్షించుకోగలమా లేదా అనికాదు: ఆ జాతీయ సంస్కృతి మనల్ని ప్రస్తుతం రక్షించగలదా లేదా అని. మనల్ని మనం కాపాడుకోవడం ప్రథమ కర్తవ్యం: ఆ జాతీయ సంస్కృతికి ఆ శక్తి ఉందా లేదా అని చూడాలిగాని - ఆ సంస్కృతి "జాతీయం" అవునా అని కాదు. —(చైనా తత్వవేత్త లూసిన్)